సాక్షి
సూర్యాపేట

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



**సేంద్రియ పద్ధతులతో భూసారం**
సేంద్రియ పద్ధతులతో భూసారం పెంపొందుతుందని సైంటిస్ట్ డాక్టర్ ఎం.బాలకృష్ణన్ అన్నారు. - 10లో



**శివ, విష్ణు ఆరాధనతో..**
శివ, విష్ణు ఆరాధనతో సిరిసంపదలు కలుగుతాయని స్వరూపానందేంద్ర సరస్వతీస్వామి ఉద్బోధించారు. - 10లో

గరిష్టం/కనిష్టం
33°/18°

**వాతావరణం**
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదకరంగా ఉంటుంది. రాత్రిపూట చలి మోస్తారుగా ఉంటుంది.

## న్యూస్‌రీల్‌

### నేడు కాంగ్రెస్‌ ముఖ్య నాయకుల సమావేశం

**హుజూర్‌నగర్‌ :** హుజూర్‌నగర్‌లోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీ ఉత్తమ్‌ కుమార్‌ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న మధ్యాహ్నం కోదాడలోని పబ్లిక్‌ క్లబ్‌ ఆడిటోరియంలో కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశాల్లో గడప గడపకు రాహుల్‌ గాంధీ సందేశం తీసుకెళ్లడంతోపాటు, కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలనే అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

### గోదావరి జలాల నిలిపివేత

**అర్వపల్లి :** జిల్లాకు వస్తున్న గోదావరి జలాలు శుక్రవారం నిలిచిపోయాయి. వారబందీ విధానంలో 4రోజుల కిందటే నిలిపివేయాల్సి ఉంది. కానీ వరిపంటలకు నీటి అవసరం పెరగడంతో నీటిపారుదలశాఖ అధికారులు అలాగే కొనసాగించారు. అయితే పై నుంచి నీటిని నిలిపివేయడంతో ఇక్కడ తాత్కాలికంగా నిలిపివేశామని ఒకటి, రెండు రోజుల్లో తిరిగి ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

### పెద్దగట్టు జాతరను విజయవంతం చేయాలి



జాతర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీఎంఎస్‌ చైర్మన్‌ వట్టె జానయ్య యాదవ్‌

**సూర్యాపేట రూరల్‌ :** ఈ నెల 5నుంచి 8వరకు నిర్వహించనున్న శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని డీసీఎంఎస్‌ చైర్మన్‌ వట్టె జానయ్య యాదవ్‌ కోరారు. శుక్రవారం సూర్యాపేట మండల పరిధిలోని బాలెంల గ్రామ సమీపంలో ఉన్న రైస్‌ ఇండస్ట్రీస్‌లో పెద్దగట్టు జాతర పోస్టర్‌ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో యాదవ జాగృతి సంఘం నాయకులు దయాయాదవ్‌, లింగరాజు యాదవ్‌, ఉప్పుల నాగమల్లు, గుండాల మహేష్‌, మెడబోయిన వెంకన్న, సతీష్‌, మల్లేష్‌, సోమేష్‌, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**మఠంపల్లి :** మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు జరిపించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చన చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ గావించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్‌ చెన్నూరు విజయ్‌ కుమార్‌, ఈఓ నవీన్‌, అర్చకులు లక్ష్మణాచార్యులు పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న రిటైర్డ్‌ ఐఏఎస్‌ చక్రపాణి

**మిర్యాలగూడ అర్బన్‌ :** మారుతున్న సాంకేతికతపై పూర్తిగా పట్టు సాధించే విధంగా విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఇంటర్మీడియట్‌ విద్య రిటైర్డ్‌ కమిషనర్‌ చక్రపాణి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం అంశంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ బి.ధన్‌రాజ్‌, పద్మ, బాలాజీ, నాగరాజు, ప్రణతి, ప్రవీణ్‌, స్వామి, రామకృష్ణ, ఫాతిమా తదితరులున్నారు.

# గట్టుకు పండుగ శోభ

## రేపటి నుంచి లింగమంతుల స్వామి జాతర

- ముమ్మరంగా సాగుతున్న పనులు
- సుమారు 50లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్‌, ఎస్పీ



పెద్దగట్టు వ్యూ

**చివ్వెంల :** పెద్దగట్టు జాతర శోభను సంతరించుకుంది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద పండుగ. ఈ జాతరకు దాదాపు 260 ఏళ్ల చరిత్ర ఉంది. లింగమంతులస్వామి దర్శనానికి రాష్ట్రంలోని 33జిల్లాలతో పాటు ఇతర సరిహద్దు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. జనవరి 22న యాదవులు సంప్రదాయం ప్రకారం జాతరకు దిష్టిపూజ నిర్వహించగా.. ఈనెల 5వ తేదీ నుంచి జాతర మొదలుకానుంది. ఈ జాతరకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జాతరలో ఆయా శాఖలకు కేటాయించిన పనులు పూర్తి చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా శుక్రవారం జిల్లా కలెక్టర్‌ వెంకట్రావ్‌, ఎస్పీ రాజేంద్రప్రసాద్‌, అదనపు కలెక్టర్‌ పాటిల్‌ హేమంత్‌ కేశవ్‌ పెద్దగట్టును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

**మొదలైన సందడి..**
జాతరకు రెండు రోజుల ముందే పెద్దగట్టు వద్ద సందడి మొదలైంది. జాతరకు సుమారు 50లక్షల మంది భక్తులు వచ్చే అవకాశముంది. జాతరలో జాయింట్‌ వీల్‌ (రంగుల రాట్నం), బ్రేక్‌ డ్యాన్స్‌, సర్కస్‌, హంస వాహనం, తదితర ఎగ్జిబిషన్‌ పరికరాలు, తదితర దుకాణాలు సిద్ధం చేసే పనిలో సంబంధిత వర్గాలు నిమగ్నమయ్యాయి.

**భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు..**
గుట్ట పరిసర ప్రాంతాలతో పాటు గుట్టపై భక్తుల సౌకర్యార్థం అధికారులు తగిన ఏర్పాట్లను చేస్తున్నారు. ఇప్పటికే చలువ పందిళ్ల ఏర్పాట్లు, ప్రధాన దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఇక గుట్టపై వైద్యారోగ్య, పోలీస్‌, మీడియా, రెవెన్యూ, దేవాలయ శాఖలకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా క్లా రశాలను సిద్ధం చేశారు. గుట్టపై జంతుబలితో రక్తం పారి దుర్వాసన వస్తుండడంతో నివారించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ప్రాంతంలో ప్లాట్‌ఫారమ్‌ నిర్మించి ఒకేమార్గం గుండా రక్తం కిందికి వెళ్లేలా పైప్‌లైన్‌ నిర్మించారు. గుట్ట కిందిభాగంలో చెరువుకట్టపై బారీకేడ్లు, గుట్టపై, కింది భాగంలో హైమాస్ట్‌ లైట్లను ఏర్పాటు చేశారు. గుట్టకు ఉత్తరభాగంలో ఉన్న కొనేరును శుభ్రం చేసి నీటితో నింపారు. అలాగే జాతీయ రహదారిపై ఉన్న సింహద్వారాలను సుందరంగా ముస్తాబు చేశారు.



శ్రీచౌడమ్మ తల్లి, యలమంచమ్మ, గంగమ్మ తల్లి విగ్రహాలు

### వసతుల ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్‌ సమీక్ష



జాతర నిర్వహణపై మాట్లాడుతున్న కలెక్టర్‌ ఎస్‌.వెంకట్రావ్‌

జాతర నేపథ్యంలో జరుగుతున్న పనులను శుక్రవారం కలెక్టర్‌ ఎస్‌.వెంకట్రావ్‌, ఎస్పీ రాజేంద్రప్రసాద్‌, అదనపు కలెక్టర్‌ పాటిల్‌ హేమంత్‌ కేశవ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. దేవాలయ ప్రాంగణాన్ని విద్యుత్‌ దీపాలతో సుందరంగా అలంకరించాలని, విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్‌, తాగునీటి వసతి, పార్కింగ్‌ సమస్య లేకుండా చూడాలన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్‌ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆలయ చైర్మన్‌ సైదులుయాదవ్‌, ఆర్డీఓ రాజేంద్రకుమార్‌, డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల్లో వేగం పెంచాలి

- క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలి
- కలెక్టర్‌ వెంకట్రావ్‌



మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకట్రావ్‌

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల్లో వేగం పెంచాలని కలెక్టర్‌ వెంకట్రావ్‌ అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి, పెండింగ్‌ పనులపై అదనపు కలెక్టర్‌ పాటిల్‌ హేమంత్‌ కేశవ్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, తహసీల్దారులు, ఎంపీఓలు, ఏపీఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ఉపాధి హామీ, హరిత హారం, రెవెన్యూ భూసమస్యలు, కల్యాణలక్ష్మి, నర్సరీల పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అన్ని కార్యాలయాల్లో బయోమెట్రిక్‌ సిస్టమ్‌ అమలు చేయనున్నట్లు తెలిపారు. పనులపై నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న సర్వేయర్ల పోస్టులను ఏజెన్సీ ద్వారా భర్తీ చేస్తామని చెప్పారు. మిషన్‌ భగీరథ ద్వారా ప్రతి గ్రామంలో తాగునీరు అందాలని, పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు, డంపింగ్‌ యార్డులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పనులు తనిఖీ చేసేందుకు ముందుగా ఆత్మకూరు మండలంలో పర్యటిస్తానని పేర్కొన్నారు. ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం చేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తానని తెలిపారు. ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులపై సత్వరమే స్పందించాలన్నారు. అర్బన్‌, రూరల్‌ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అనంతరం ధరణి మ్యాడ్యూల్స్‌, రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లతో సమీక్షించారు. సమావేశంలో ఆర్డీఓలు రాజేంద్రకుమార్‌, కిశోర్‌కుమార్‌, సీఈఓ సురేష్‌, పీడీ కిరణ్‌ కుమార్‌, డీపీఓ యాదయ్య, ఏడీఏ రామారావునాయక్‌, సీపీఓ వెంకటేశ్వర్లు, డీహెచ్‌ఓ శ్రీధర్‌గౌడ్‌, మున్సిపల్‌ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టరేట్‌ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** నూతన కలెక్టరేట్‌ భవన నిర్మాణ పనులను మే చివరి కల్లా పూర్తి చేయాలని కలెక్టర్‌ వెంకట్రావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని కుడకుడ ప్రాంతంలో నిర్మిస్తున్న కలెక్టరేట్‌ను లోకల్‌ బాడీస్‌ అదనపు కలెక్టర్‌ పాటిల్‌ హేమంత్‌ కేశవ్‌తో కలిసి సందర్శించారు. పనులు మందకొడిగా జరుగుతున్నాయని, వేగవంతం చేసి మే చివరి కల్లా పూర్తి చేయాలని జిల్లా, రోడ్లు భవనాల అధికారిని ఆదేశించారు. అనంతరం బిల్డింగ్‌ ప్లాన్‌ను పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణాల వివరాలను ఆర్‌అండ్‌బీ ఈఈ యాకోబును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీఓ రాజేంద్ర కుమార్‌, ఆర్‌అండ్‌బీ ఏఈ యుగంధర్‌, గుత్తేదార్‌ ఇంజనీర్లు రవి కిశోర్‌ అధికారులు సిబ్బంది ఉన్నారు.

## పేదలందరికీ ఇళ్లు దక్కే వరకూ పోరాటం



మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

**హుజూర్‌నగర్‌ :** ఇల్లులేని పేదలకు ఇల్లు దక్కే వరకూ పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డీటీ సుధారాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి నాగారపు పాండు, జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, నర్సింహారావు, మండల కార్యదర్శి హుస్సేన్‌, కౌన్సిలర్‌ తివేణి, సీఐటీయూ నాయకులు శీలం శ్రీను, మురళి, సోమయ్య, వీరమల్లు, వీరస్వామి, వెంకన్న, పర్వతాలు, సాంబయ్య తదితరులు ఉన్నారు.

# ఆధార్‌ నమోదు 90శాతం పూర్తి

- పూర్తి కావొస్తున్న ఉపాధి హామీ కూలీల ఆధార్‌ నమోదు ప్రక్రియ
- మొత్తం కూలీలు 3,59,427
- ఇప్పటివరకు పూర్తయినవి 3,18,735
- ఇంకా కావాల్సినవి 40,692



అర్వపల్లిలోని ఉపాధి కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ఆధార్‌ వివరాలు నమోదు చేస్తున్న సీఓలు, సిబ్బంది

**అర్వపల్లి :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనిచేసే కూలీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఆధార్‌ నంబర్‌ నమోదు ప్రక్రియ జిల్లాలో పూర్తి కావొస్తుంది. ఇప్పటికే ఈ ప్రక్రియ 90 శాతం మేర పూర్తయింది. ఈమేరకు ఉపాధిహామీ పథకంలో పనిచేసే సీఓల నుంచి టీఏలు మొదలుకొని ఏపీఓల వరకు మొత్తం సిబ్బంది ఈ పనిలో తలమునకలై ఉన్నారు. ఉపాధిహామీ పథకం పారదర్శకంగా జరగడం, ఈ పథకంలో ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా చేపట్టడం, ఆధార్‌ నంబర్‌ నమోదైతేనే కూలీ డబ్బులు వచ్చే విధంగా సంస్కరణలు తీసుకురావడంతో ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. జిల్లా వ్యాప్తంగా 150 మంది వరకు ఉపాధి సిబ్బంది ఈ పనిలో నిమగ్నమయ్యారు. ఈనెల నుంచి ఆన్‌లైన్‌లో ఉపాధి కూలీల హాజరు నమోదు చేసి నేషనల్‌ మొబైల్‌ మానిటరింగ్‌ యాప్‌(ఎన్‌ఎంఎంఎస్‌)లో వివరాలు పొందుపరుస్తున్నారు. అయితే కూలీల బ్యాంక్‌ ఖాతాకు ఆధార్‌ అనుసంధానమైతే నేరుగా అందులోనే వేతనాలు పడనున్నాయి. ఇప్పటివరకు అనేక మండలాల్లో పోస్టాఫీసుల ద్వారా డబ్బులు చెల్లిస్తున్నారు.

**జిల్లాలో ఇలా..**
జిల్లాలో 475 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం కూలీలు 3,59,427మంది ఉన్నారు. వీరిలో ఇప్పటికే 3,18,735 మంది కూలీల ఆధార్‌ నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. ఇంకా 40,692 మంది కూలీల ఆధార్‌ నంబర్‌ నమోదు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు జిల్లాలోని అన్ని మండలాల ఉపాధిహామి సిబ్బంది కలెక్టరేట్‌లోనే ఉంటూ అక్కడే ఆధార్‌ ఆన్‌లైన్‌ నమోదు చేస్తున్నారు.

### త్వరలో పూర్తి చేస్తాం



ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సంబంధించిన ఆధార్‌ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆధార్‌ నమోదు ప్రక్రియ 90శాతం వరకు పూర్తయింది. మిగిలిన కూలీల ఆధార్‌ నంబర్లను కూడా త్వరలో నమోదు చేసి ప్రక్రియ పూర్తిచేస్తాం.

– కిరణ్‌కుమార్‌, డీఆర్‌డీఓ

# పండిట్ల పరేషాన్‌

- ప్రమోషన్ల విషయంలో భాషా పండితులు, పీఈటీల ఆశలపై నీళ్లు
- ఈ నెల 1 నుంచి 9, 10 తరగతులకు బోధన నిలిపి వేసి నిరసన
- పదోన్నతి కల్పించాలని డిమాండ్‌



డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న భాషా పండిట్‌లు (ఫైల్‌)

**సూర్యాపేటటౌన్‌ :** ఎనిమిది సంవత్సరాల తర్వాత టీచర్ల పదోన్నతులు, బదిలీలు నిర్వహిస్తుంటే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ భాషా పండింతులు మాత్రం నిరుత్సాహంతో ఉన్నారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విధంగా కాకుండా ఇప్పుడు మౌనంగా ఉందని, దీంతో తమకు పదోన్నతులు పొందకుండా ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా తమకు సముచిత స్థానం దక్కనందుకు శక్తికి మించి పని ఎందుకు చేస్తామని ఆందోళన బాట పడుతున్నారు.

**పండితుల ఊసే లేకపోవడంతో..**
ఉపాధ్యాయుల పదోన్నతుల పక్రియ ప్రారంభం కావడంతో అందరి మాదిరిగా తమకు కూడా ప్రమోషన్‌ వస్తుందని తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులు ఆశపడ్డారు. ఇప్పటి వరకు గ్రేడ్‌–2 భాషా పండితులుగా ఉన్న తమకు గ్రేడ్‌–1 హోదా వస్తుందని, పీఈటీలు పీడీలుగా అప్‌గ్రేడ్‌ చేస్తారని, స్కూల్‌ అసిస్టెంట్ల స్థాయి కల్పిస్తారని అనుకున్నారు. కానీ అధికారులు ప్రమోషన్ల జాబితా తయారు చేసి ప్రకటించిన తర్వాత భాషా పండితుల ఊసే లేదని తెలిసింది. మీ వ్యవహారం కోర్టులో ఉందని అధికారులు చెప్పడంతో నిరాశకు గురయ్యారు.

| జిల్లాలో పోస్టులు ఇలా.. | |
|---|---|
| తెలుగు పండిట్స్‌ | - 140 |
| హిందీ పండిట్స్‌ | - 130 |
| పీఈటీలు | - 110 |

**9,10 తరగతులకు బోధించబోమని నిరసన**
తమకు హోదా లేకపోయినా ఇప్పటి వరకు 9,10 తరగతులకు బోధించాం. కానీ ఇప్పటి నుంచి బోధించమనే నిర్ణయంతో జిల్లాలోని తెలుగు, హిందీ భాషోపాధ్యాయులు నిరసన బాట పట్టారు. తమ నియామకం ప్రకారం గ్రేడ్‌–2 పండిట్‌ హోదాలో నర్సరీ నుంచి 8వ తరగతి వరకు బోధించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలోని అత్యధిక మంది గ్రేడ్‌–2 పండితులు పదవ తరగతి వరకు బోధిస్తున్నారు. అయితే ఈ తరగతులు బోధించే వారు స్కూల్‌ అసిస్టెంట్‌ క్యాడర్‌ వారే ఉండాలి. అర్హత లేని తాము ఈ తరగతులు బోధించబోమని చెబుతున్నారు. ఇందులో భాగంగా మూడు రోజుల నుంచి పండితులు నిరసన కార్యక్రమాల చేపట్టారు. ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి 9, 10 తరగతులకు బోధించమని చెబుతూ.. కలెక్టర్‌, డీఈఓతో పాటు ఎక్కడికక్కడ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, పలుచోట్ల మండల విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

### న్యాయం చేయాలి

పండిట్‌, పీఈటీలకు ప్రభుత్వం న్యాయం చేయాలి. న్యాయంగా రావాల్సిన ప్రమోషన్లు అందిస్తే విద్యా వ్యవస్థలో, మాతృభాష తెలుగు, ఉర్దూ, జాతీయ భాష హిందీ, వ్యాయామ ఉపాధ్యాయుల మానసిక క్షోభ తగ్గుతుంది. గ్రేడ్‌–2 పండితులను అప్‌గ్రేడ్‌ చేస్తామని ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌హామీ ఇచ్చారు. అప్పట్లో సర్టిఫికెట్లు కూడా పరిశీలించారు. కానీ కోర్టు కేసు నెపంతో మళ్లీ వెనక్కి నెట్టారు. ఇది సరికాదు. ఇంగ్లిష్‌ మాదిరిగా తెలుగు, హిందీ పండిట్లకు కూడా స్కూల్‌ అసిస్టెంట్ల హోదా కల్పించాలి. దానికి అనుగుణంగా పదోన్నతులు ఇవ్వాలి.

– రాంకుమార్‌రెడ్డి, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్‌ వర్కింగ్‌ ప్రసిడెంట్‌

## పల్లె దవాఖానాలతో గ్రామీణ ప్రాంతాలకు వైద్యం

- జెడ్పీ చైర్‌పర్సన్‌ గుజ్జ దీపిక



వెంపటి గ్రామంలో పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ గుజ్జ దీపిక

**నూతనకల్‌ :** పల్లె దవాఖానాలతో గ్రామీణ ప్రాంతాలకు వైద్యాన్ని తీసుకువచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని జెడ్పీ చైర్‌పర్సన్‌ గుజ్జ దీపిక అన్నారు. శుక్రవారం నూతనకల్‌ మండల పరిధిలోని వెంపటి గ్రామంలో రూ.12లక్షలతో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానాను ప్రారంభించి మాట్లాడారు. చిన్నచిన్న అనారోగ్య కారణాలు సీరియస్‌గా మారి, పల్లె ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటున్న నేపథ్యంలో వారి ఆరోగ్యాలను కాపాడడానికి పల్లె దవాఖానాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. అంతకు ముందు గ్రామంలో గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని, మత్స్యకారుల భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్‌ కోటాచలం, డాక్టర్‌ పెండెం వెంకటరమణ, ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్‌, మండల వైద్యాధికారి డాక్టర్‌ నాగునాయక్‌, డీసీసీబీ డైరెక్టర్‌ గుడిపాటి సైదులు, సర్పంచ్‌ పద్మసత్యనారాయణ, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

## 11 నుంచి టీసీసీ పరీక్షలు

**సూర్యాపేటటౌన్‌ :** టెక్నికల్‌ సర్టిఫికెట్‌ కోర్సు (టీసీసీ) ఎగ్జామినేషన్‌ ఇన్‌ లోయర్‌, హయర్‌ ఇన్‌ డ్రాయింగ్‌, టైలరింగ్‌, ఎంబ్రాయిడింగ్‌ పరీక్షలు ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీవరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌ టికెట్లను వెబ్‌సైట్‌ నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నాలుగు సెంటర్లలో ఉదయం 10గంటల నుంచి 12.30గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రాయింగ్‌ లోయర్‌ 318 మంది, డ్రాయింగ్‌ హయర్‌ 202, టైలరింగ్‌ లోయర్‌లో 86 మంది, టైలరింగ్‌ హయర్‌లో 82 మంది పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు.

## మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలి

- జెడ్పీసీఈఓ సురేష్‌



అర్వపల్లిలో 365బీ హైవే వెంట చెట్లకు నీరు పోస్తున్న జెడ్పీసీఈఓ సురేష్‌, ఎంపీపీ రేణుక

**అర్వపల్లి :** మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని జెడ్పీ సీఈఓ సురేష్‌ అన్నారు. శుక్రవారం గ్రీన్‌డేలో భాగంగా అర్వపల్లి, రామన్నగూడెం గ్రామాల్లో 365బీ హైవే వెంట ఉన్న చెట్లకు నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను వెంటనే మొదలు పెట్టాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీ నర్సయ్యయాదవ్‌, ఎంపీఓ సందీప్‌కుమార్‌, ఏపీఓ ఉపేందర్‌, ఈసీ నగేష్‌, టీఏ దీపిక, కార్యదర్శులు మాగి నాగయ్య, ఉపేందర్‌రావ్‌ సిబ్బంది తదితరులు ఉన్నారు.

**మొక్కలను సంరక్షించాలి**
**నాగారం :** హరితహారంలో నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని జెడ్పీసీఈఓ సురేష్‌కుమార్‌ అన్నారు. గ్రీన్‌డే సందర్భంగా శుక్రవారం నాగారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో మొక్కలకు నీరు పోశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మొక్కలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఉపాధిహామీ పనులు కల్పించాలన్నారు. అనంతరం మొక్కల చుట్టూ ఉన్న చెత్త, చెదారం తొలగించారు. ఆయన వెంట ఎంపీడీఓ శోభారాణి, ఈసీ ముక్కంటి, టీఏ రాంనరేష్‌, కార్యదర్శి కొమ్ము అరుణ్‌ ఉన్నారు.

## కల్యాణం.. కమనీయం



యాదాద్రి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న ప్రధానాచార్యులు



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

## క్లుప్తంగా

### వైభవంగా తిరువీధి సేవోత్సవం



ఆలయంలో అమ్మవారికి సేవోత్సవాన్ని నిర్వహిస్తున్న ఆచార్యులు

**యాదగిరిగుట్ట** : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాల్ అమ్మవారి తిరువీధి సేవోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ మాఢ, తిరువీధిలో ఆండాల్ అమ్మవారిని విశేషంగా అలంకరించి, సేవోత్సవం చేపట్టారు. అనంతరం మండపంలో అమ్మవారికి ఊంజలి సేవోత్సవాన్ని జరిపించారు. మహిళలు మంగళ హారతులు, భాజభజంత్రీలతో సేవోత్సవం ఘనంగా జరిగింది.

### వ్యక్తి అదృశ్యం

**ఆత్మకూర్–ఎస్** : ఇంటి నుంచి పనికోసం వెళ్లి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లగొండ లింగయ్య 18రోజుల క్రితం సూర్యాపేట పట్టణానికి పని కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వెతకగా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తండ్రి నల్లగొండ వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదవేందర్ రెడ్డి తెలిపారు.

### ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

**చౌటుప్పల్** : ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెగూడెం గ్రామానికి చెందిన గంగనబోయిన ఐలయ్య(40) వృత్తి రీత్యా లారీడ్రైవర్. గురువారం ఐలయ్య ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై పంతంగి గ్రామం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తన ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఐలయ్య శరీర లోపలి భాగంలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అన్న గంగనబోయిన శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు

**హుజూర్‌నగర్ (చింతలపాలెం)** : టిప్పర్, టీవీఎస్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో టీవీఎస్‌పై ప్రయాణిస్తున్న భార్యభర్తల్లో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చింతలపాలెం గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం గ్రామానికి చెందిన ఎస్‌కే నబీసాబ్(65) అతడి భార్య సైదాబీ పొలం పనికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో చింతలపాలెం నుంచి మేళ్లచెరువు వైపు వెళ్తున్న టిప్పర్ వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నబీసాబ్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందగా అతడి భార్య సైదాబీకి తీవ్రగాయాలయ్యాయి. దీంతో గమనించిన స్థానికులు హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అటునుంచి మెరుగైన చికిత్సకు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. వారి కుమారుడు ఎస్‌కే సత్తార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.



# లింగమంతుల జాతర ఇలా..

- ఈనెల 5నుంచి ఐదురోజుల పాటు జరుగనున్న జాతర

**చివ్వెంల** : ఈనెల 5నుంచి ప్రారంభంకానున్న పెద్దగట్టు శ్రీలింగమంతులస్వామి జాతర 5రోజుల పాటు సాగనుంది. ఒక్కోరోజు ఒక్కో విశిష్టతతో జరగనున్న జాతర మొదటగా గంపల ప్రదక్షిణతో ప్రారంభమై.. ఐదోరోజు స్వామివారి ప్రత్యేక దర్శనంతో ముగుస్తుంది.

**→ మొదటిరోజు గంపల ప్రదక్షిణ..**

జాతరలో మొదటిది అత్యంత కీలకమైన ఘట్టం గంపల ప్రదక్షిణ. దిష్టిపూజ జరిగిన 15రోజుల తర్వాత (ఆదివారం) జాతర ప్రారంభం అవుతుంది. ఆదివారం కేసారం గ్రామం నుంచి చౌడమ్మ తల్లి ఉన్న దేవరపెట్టెను తీసుకొని యాదవ, రెడ్డి కులస్తులు కాలినడకన బయలుదేరి దురాజ్‌పల్లిలో ఉన్న గొల్లగట్టు (పెద్దగట్టు)కు చేరుకుంటారు. ఈ సందర్భంగా గజ్జల లాగులు ధరించి భేరి చప్పుల్లు, కత్తుల విన్యాసాలు చేస్తూ ఓ లింగా.. ఓలింగా.. నామస్మరణంతో గంపలతో ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేస్తారు. మెంతబోయిన, రెడ్డి, గొర్ల, మున్నవారి సమక్షంలో రెండు బోనాలు చేసి పూజలు నిర్వహిస్తారు. దీంతో మొదటి రోజు ఘట్టం ముగుస్తుంది.



శ్రీ లింగమంతుల స్వామి ఆలయం

**→ రెండో రోజు సౌడమ్మకు బోనాలు..**

జాతరలో రెండో రోజు (6వ తేదీ, సోమవారం) చౌడమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తారు. ఇందులో భాగంగా మున్న వంశీయులు తెచ్చిన బద్దెపాల గొర్రె, రెడ్డి వంశీయులు తెచ్చిన వర్ధ గొర్రె,, మెంతబోయిన వారు తల్లి గొర్రెలను ముందుగా అమ్మవారి ముందు ఆయుధాలతో జల్త పడుతారు. అనంతరం మున్న వంశీయులు ఉపవాసం ఉండి నిష్ఠతో తెచ్చిన బద్దెపాల గొర్రెను అమ్మవారికి బలి ఇస్తారు. అనంతరం గొర్రె ఆయాలు సాయాలు (పేగులు, లివర్ కిడ్నీలు, నల్లెడ, గుండె, మాంసం) నెయ్యిలో వేసి వంట చేస్తారు. మున్న వంశీయులు యజమానులుగా, మెంతబోయిన వారు జాగిలాలుగా వ్యవహరిస్తూ, మెుంతబోయిన వారి మెడలో కండువాలు ఉంచి మున్నవారు పట్టుకోగా బండపై పోసిన అన్నాన్ని మెుంతబోయిన వారు నోటితో నాకుతారు (తింటారు).



నీటితో నింపిన కోనేరు

**→ మూడో రోజు చంద్రపట్నం..**

మూడో రోజు (7న, మంగళవారం) స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా చంద్రపట్నం వేస్తారు. మెంతబోయిన వారు తీసుకొచ్చిన పూజాసామగ్రి, తెల్లపిండి, పచ్చపిండి, పసుపు, కుంకుమలతో చంద్రపట్నం వేస్తారు. చెక్కపై పసుపు, కుంకుమలు వేసి అందంగా పట్నం వేస్తారు. అనంతరం యాదవ వంశీయులు స్వామి వారి కల్యాణం జరిపిస్తారు. దీంతో చంద్రపట్నం , స్వామివారి కల్యాణం తంతు ముగుస్తుంది.

**→ నాలుగోరోజు నెలవారం..**

జాతరలో నాలుగో రోజు బుధవారం (8న) జరిగే కార్యక్రమం నెలవారం. కేసారం నుంచి పాలు తీసుకొచ్చి రెండు కొత్త బోనం కుండల్లో పాలు పొంగిస్తారు. అనంతరం మున్నావారి గొర్రెను బలిఇస్తారు. ఈ సందర్భంగా బైకాన్లు, బక్కులు కథలు చెప్పడం ద్వారా తంతు పూర్తి చేస్తారు.

**→ ప్రత్యేక దర్శనంతో ఐదో రోజు ముగింపు..**

జాతరలో ఐదోరోజైన గురువారం (9న) స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచుతారు. జాతర తంతు పూర్తయిన తర్వాత మొత్తం భక్తులు తుదిసారిగా మొక్కులు చెల్లించి ఇంటి ముఖం పడతారు. దీంతో జాతర ముసిగినట్లు ప్రకటిస్తారు.

### జాతరకు బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

**భానుపురి (సూర్యాపేట)** : దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర సందర్భంగా సూర్యాపేట ఆర్టీసీ డిపో నుంచి ఏర్పాటు చేసే ప్రత్యేక బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట డీఎం సురేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక డిపోలో పెద్దగట్టు జాతరకు మొదటి బస్సును డప్పువాయిద్యాల నడుమ ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి పెద్దగట్టు వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో యాకాంబరం, ఎన్‌సీ సైదులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



జాతర స్పెషల్ బస్సు ప్రారంభిస్తున్న డీఎం



గుట్టపై ఉన్న కోనేరుకు వేసిన రంగులు



కోనేరు పక్కన ఏర్పాటు చేసిన గదులు



జాతరలో ఏర్పాటు చేసిన జాయింట్ వీల్స్



మెట్ల వద్ద ఏర్పాటు చేసిన ఆహ్వాన ఫ్లెక్సీ



జాతరలో ఏర్పాటు చేసిన బస్సు పార్కింగ్

## ప్రేమించినవాడు దక్కడం లేదని..

యువతి బలవన్మరణం

**రాజాపేట** : ప్రేమించినవాడు దక్కడంలేదని మనస్థాపానికి గురైన ఓ యువతి బావిలోదూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని పాముకుంట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాకల్ల చంద్రమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. కాగా చిన్నకుమార్తె మౌనిక(20) తండ్రి చనిపోవడంతో తల్లితో కలిసి వ్యవసాయ పనులు చేస్తుండేది. మౌనిక అదే గ్రామానికి చెందిన ఓ యువకుడిని ప్రేమించింది. అతడికి కొద్దిరోజుల క్రితం పెళ్లి సంబంధం కుదిరింది. దీంతో ప్రేమించిన వ్యక్తి తనకు దక్కడంలేదని మనస్థాపానికి గురైన మౌనిక గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతకగా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం గ్రామం శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద మౌనిక చెప్పులు లభించడంతో బావిలో వెతకగా శవమై తేలింది. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



కాకళ్ల మౌనిక (ఫైల్)

## బాలికను వేధించిన వ్యక్తికి జైలు

**గుండాల** : ఓ మైనర్ బాలికను ప్రేమపేరుతో వేధించిన వ్యక్తికి 3సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ భువనగిరి జడ్జి కె.మారుతీదేవి శుక్రవారం తీర్పు వెలువరించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలిక జనగామ జిల్లా కేంద్రంలోని ట్రిబుల్ ఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. దీంతో అదే గ్రామానికి చెందిన మారాజు సతీష్ అలియాస్ సత్యనారాయణచారి ఆ బాలికను ప్రేమపేరుతో రోజూ వేధించసాగాడు. ఆ బాలిక వేధింపులు తట్టుకోలేక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు సతీష్ తల్లి దండ్రులకు చెప్పినప్పటికీ మార్పురాక పోగా, ఓ రోజు బాలిక కళాశాలకు వెళ్తుండగా అడ్డుకొని ప్రేమించాలని, లేకపోతే చంపుతానని తనకు రోజూ ఫోన్ చేయాలని బెదిరించాడు. దీంతో బాలిక వెంటనే తన తండ్రికి విషయాన్ని చెప్పడంతో 27-09-2017న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాలిక తండ్రి ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌ఐ నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు శుక్రవారం కోర్టులో తీర్పుకురాగా నిందితుడికి 3సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.



మారోజు సతీష్

## స్వాతంత్ర్య సమరయోధుడు జనార్దన్‌రెడ్డి మృతి



చింతలపురి జనార్దన్‌రెడ్డి (ఫైల్)

**రాజాపేట** : మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చింతలపురి జనార్దన్‌రెడ్డి (98) శుక్రవారం మృతి చెందాడు. జనార్దన్‌రెడ్డి తెలంగాణ సాయుధ పోరాటంలో చురుకుగా పనిచేశారు. జనార్దన్‌రెడ్డి కొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. ఆయనకు ఓ కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

## వ్యక్తి మృతదేహం లభ్యం

**రామగిరి(నల్లగొండ)** : తిప్పర్తి మండలం గడ్డికొండారం గ్రామంలోని చాకలికుంటలో శుక్రవారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ మృతదేహం జనవరి 24న ఇంట్లో నుంచి వెళ్లిపోయిన అదే గ్రామానికి చెందిన ఆంజనేయులుగా స్థానికులు గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. జాలా ఆంజనేయులుతో(30) పానగల్‌లోని లెప్రసీ కాలనీకి చెందిన శ్రేయతో 2018లో వివాహం జరిగింది. ఆంజనేయులు వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తుంటాడు. ఇతను మద్యానికి బానిస కావడంతో భార్య శ్రేయ కొద్దిరోజులుగా పుట్టింటి వద్ద ఉంటుంది. ఈక్రమంలో జనవరి 24న ఆంజనేయులు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. వారం అయినా ఇంటికి రాకపోవడంతో మృతుడి భార్య ఫిబ్రవరి 2న తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శుక్రవారం గ్రామానికి చెందిన మహిళలు కట్టెల కోసం వెళ్తుండగా మధ్యాహ్నం సమయంలో చాకలికుంటలో ఆంజనేయులు మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం డెడ్‌బాడీని కుటుంబ సభ్యులకు అందజేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వాస ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అయితే ఆంజనేయులు ప్రమాదవశాత్తు చాకలికుంటలో పడి ఉంచవచ్చని పోలీసులు భావిస్తున్నారు.



ఆంజనేయులు (ఫైల్)

# కనులపండువగా శ్రీపూర్వగిరీశుడి కల్యాణం

- పాతగుట్టలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు
- అర్ధరాత్రి వైభవంగా లక్ష్మీనరసింహుల పరిణయం

**యాదగిరిగుట్ట** : శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీనృసింహస్వామి కల్యాణాన్ని శుక్రవారం రాత్రి అర్చకులు కనులపండువగా నిర్వహించారు. ఈ వేడుకలో గజవాహనంపై శ్రీనృసింహస్వామి, ప్రత్యేక పల్లకిపై శ్రీలక్ష్మీ అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వజ్ర వైఢ్యూరాలతో ముస్తాబు చేసి తిరువీధుల్లో ఊరేగిస్తూ కల్యాణ మండపానికి తీసువచ్చి కల్యాణ తంతును నిర్వహించారు. ఆయా వేడుకల్లో ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణరావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయాధికారులు, ప్రధానాచార్యులు, ఉప ప్రధానార్చకులు, ఆచార్యులు పాల్గొన్నారు.

**తిరువీధుల్లో ఊరేగింపు..**

శ్రీనృసింహుడు దేవేరి శ్రీలక్ష్మీదేవిల పరిణయ వేడుక అద్యాంతం భక్త జనుల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. భాజా భజంత్రీలు, భక్తుల జయజయ నినాదాలు, పండితుల వేదమంత్రాల నడుమ శ్రీస్వామి వారు గజవాహనారుఢుడై.. సర్వాలంకార సుశోభితుడుగా, సుందర మనోహరుడుగా.. అమ్మవారు దివ్యాలంకార శోభితమై ప్రత్యేక పల్లకిసేవలో శ్రీస్వామి వారిని అనుసరించగా ఆలయ తిరువీధుల్లో ఊరేగింపు సేవ సాగింది.

**జీలకర్ర బెల్లం.. మాంగళ్యధారణ**

ఆది దేవతల తిరుకల్యాణ మహోత్సవంలో విశేషంగా జరిగింది. ఆచార్యులు శ్రీ స్వామికి జంధ్యధారణ చేసి సకల దేవలత ఆశీస్సులతో.. వేద మంత్ర పఠనంతో శ్రీవారు అమ్మవారికి, అమ్మవారు శ్రీవారికి జీలకర్ర బెల్లం పెట్టిన తంతు కనులపండువగా జరిగింది. అనంతరం వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, సన్నాయి మేళాల నడుమ శ్రీనృసింహుడు శ్రీమహాలక్ష్మీ అమ్మవారి మెడలో మాంగళ్య ధారణ గావించారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

**నేడు రథోత్సవం..**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో ఉదయం 8గంటలకు హవనం పూజలు నిర్వహిస్తారు. అనంతరం గరుఢ వాహనంపై శ్రీస్వామి వారిని ఊరేగిస్తారు. రాత్రి 8గంటలకు శ్రీస్వామి వారి రథోత్సవాన్ని జరిపిస్తారు.



హనుమంత వాహనసేవను ఊరేగిస్తున్న ఆచార్యులు, అధికారులు

**ఉదయం హనుమంత వాహనంపై..**

బ్రహ్మోత్సవంలో భాగంగా ఉదయం 8గంటలకు పారాయణీకులచే నిత్య ప్రబంధ పారాయణములు, యాజ్ఞీకులచే నిత్య హవనములు, మూల, మూర్తిమంత్ర అనుష్టానములు, హవనం పూజలు జరిగాయి. అనంతరం శ్రీస్వామి వారికి, అమ్మవారికి వేదమంత్ర మధ్య 'తిరుమంజన మహోత్సవ 'వేడుక నిర్వహించారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. యాదగిరిగుట్టకు చెందిన శ్రీభాగ్యలక్ష్మీ భజన మండలి, వీర పత్రాప భజన మండలిచే భజన, జీవీఆర్ మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్ వాచిచే భక్తి సంగీతం, మిర్యాల నిఖిల బృందంచే నృత్య ప్రదర్శన నిర్వహించారు.



ఆలయ ఆవరణలో నృత్యం చేస్తున్న కళాకారిణి



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆర్డీఓ భూపాల్‌రెడ్డి

## విద్యుదాఘాతంతో రైతు మృతి

**వలిగొండ** : మండలంలోని గోకారంలో గురువారం రాత్రి ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటగళ్ల ముత్యాలు (65) తన పొలం వద్ద విద్యుత్ మోటారు పని చేయకపోవడంతో మరమ్మతులు చేయడానికి గురువారం సాయంత్రం వెళ్లాడు. కాగా మోటార్ వద్దకు వెళ్లే దారి నిండా గడ్డి మొలవడంతో కొడవలితో కోస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడున్న కరెంట్ వైరు ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి సమయం 10 దాటినా ముత్యాలు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి వెతకగా మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుమారుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

## రాచకొండలో సరిహద్దుల పరిశీలన

**సంస్థాన్ నారాయణపురం** : మండలంలోని రాచకొండ ప్రాంతంలో రెవెన్యూ, ఆటవీ శాఖ భూముల సరిహద్దులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూములకు సంబంధించిన మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. సర్వే నంబర్లు, భూముల రకాలపై ఆరా తీశారు. ఆయన వెంట చౌటుప్పల్ ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రాజు తదితరులు ఉన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

**యాదగిరిగుట్ట రూరల్** : పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణ సీఐ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాళ్లగూడెం గ్రామశివారులో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం తెలియడంతో ఎస్‌ఓటీ పోలీసులతో కలిసి గురువారం రాత్రి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.65,430నగదు, రెండు కార్లు, 4బైకులు, 10సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



శుక్రవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరవుతున్న ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి, భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి